# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-01 మరియు 2 06 ఫిబ్రవరి, 2019

**(ఉదయం మరియు మధ్యాహ్నం సమావేశాల పూర్తి ప్రకటన)**

గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని, గ్రామాలు వేదికగానే ప్రగతి ప్రణాళికలకు అమలు కావాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆకాంక్షించారు. కొత్తగా ఎన్నికయ్యే సర్పంచులు వార్డు సభ్యులను, గ్రామాల ప్రజలను కలుపుకుని సామూహికంగా గ్రామ వికాసానికి పాటు పడాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీలకు అవసరమైన నిధులు, విధులు కేటాయిస్తామని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా, రహదారుల నిర్మాణం లాంటి ముఖ్యమైన పనులన్నీ ప్రభుత్వమే నేరుగా చేస్తున్నందున గ్రామాల్లో పచ్చదనం పెంచడం, పరిశుభ్రత పాటించడం, వైకుంఠధామాల (స్మశాన వాటికలు) నిర్మాణంపై పంచాయతీలు ఎక్కువ దృష్టి పెట్టాలని కోరారు. గ్రామాల సర్పంచులను, గ్రామ కార్యదర్శులను ఛేంజ్ ఏజెంట్సుగా మార్చే బాధ్యతను రిసోర్సు పర్సన్లు చేపట్టాలని చెప్పారు. గ్రామ పంచాయతీలకు అధికారాలను బదిలీ చేసే విషయంలో, నిధులు కేటాయించే విషయంలో అత్యంత ఉదారంగా ఉంటామని, అదే సమయంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా సర్పంచులు, గ్రామ కార్యదర్శులను సస్పెండ్ చేసే విధంగా కఠిన చట్టాన్ని రూపొందించినట్లు సిఎం వెల్లడించారు.

కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే రిసోర్సు పర్సన్స్ తో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు బుధవారం ప్రగతి భవన్ లో సమావేశమయ్యారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సిఎస్ ఎస్.కె. జోషి, ఎమ్మెల్యేలు డి.ఎస్. రెడ్యానాయక్, వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, ఎండిసి చైర్మన్ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చందర్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, కమీషనర్ నీతూ ప్రసాద్, సెర్ప్ సిఇవో పౌసమి బసు, సిఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు రిసోర్సు పర్సన్లను ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామాల వికాసానికి సర్పంచులు అంకితభావంతో పనిచేయడానికి కావాల్సిన అవగాహనను, చైతన్యాన్ని కలిగించాలని కోరారు.

ప్రతీ గ్రామ పంచాయతీ తన పరిధిలోని వనరులు, అవసరాలను బేరీజ వేసుకుంటూ ఐదేళ్ల గ్రామ ప్రణాళిక తయారు చేసుకోవాలని, దానికి అనుగుణంగా పనులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామం ఇప్పుడు ఎక్కడుంది? ఐదేళ్ల తర్వాత ఎక్కడికి పోవాలి? ఐదేళ్లలో ఎన్ని నిధులు వస్తాయి? వాటితో ఎలాంటి పనులు చేయాలి? అనే విషయాలను నిర్ధారించుకుని రంగంలోకి దిగాలని ముఖ్యమంత్రి సూచించారు. చీకట్లో బాణం విసిరినట్లు కాకుండా, లక్ష్యసిద్ధితో గురి చూసి కొట్టాలి. 'గ్రీన్ విలేజ్- క్లీన్ విలేజ్' నినాదంతో గ్రామంలో పచ్చదనం పెంచడానికి, పారిశుద్ధ్య పరిపరిరక్షణకు, స్మశాన వాటికల నిర్మాణానికి, పన్నుల వసూలుకు మొదటి దఫాలో ప్రాధాన్యత ఇస్తూ ప్రణాళిక తయారు కావాలని చెప్పారు. ఈ ప్రణాళిక తయారీలో సర్పంచులు, కార్యదర్శులకు రిసోర్సు పర్సన్లు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని, గ్రామ వికాసానికి పాటుపడేలా వారిలో స్ఫూర్తిని, చైతన్యాన్ని రగిలించాన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందనే విషయం చెప్పి, అప్రమత్తం చేయాలని చెప్పారు. కొత్త గ్రామీణ తెలంగాణను తయారు చేసే చేంజ్ ఏజెంట్లుగా, మెంటార్లుగా రిసోర్సు పర్సన్లు వ్యవహరించాలని చెప్పారు. ప్రతీ ఆరు నెలలకోసారి రిసోర్స్ పర్సన్స్ తో తాను స్వయంగా సమావేశం అవుతానని సిఎం వెల్లడించారు.

**టీచర్ లాగా పాఠాలు బోధించిన సిఎం**

రిసోర్సు పర్సన్లకు శిక్షణ ఇచ్చే సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ టీచర్ అవతారమెత్తారు. ప్రతీ విషయంపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయిన సమావేశంలో మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలబడే మాట్లాడారు. భోజన విరామం తర్వాత 3 గంటల నుంచి 5 గంటల వరకు మళ్లీ నిలబడే మాట్లాడారు. గ్రామ పంచాయతీ కొత్త చట్టం, గ్రామ

పంచాయతీల బాధ్యతలు- విధులు, నిధులు సమకూరే మార్గాలు, ఖర్చు పెట్టే పద్ధతులు, ప్రజా ప్రతినిధులకు నైతిక నియమాలు, రిసోర్స్ పర్సన్ల బాధ్యతలపై సుదీర్ఘంగా మాట్లాడారు. చాలా సార్లు సిఎం కేసీఆర్ హాస్యం పండించడంతో సమావేశంలో నవ్వులు విరబూసాయి. 5 గంటల నుంచి 6 గంటల వరకు ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. రిసోర్సు పర్సన్ల సందేహాలను సిఎం ఓపిగ్గా తీర్చారు. వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

**పలుమార్లు పద్యాలు చదివిన కేసీఆర్**

ఆయా అంశాలపై అవగాహన కల్పించే క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశంలో పలుమార్లు సందర్భోచితంగా పద్యాలు చదివి, దాని అర్థం చెప్పారు. 'అనగననగ రాగ మతిశయిల్లుచునుండు'' అనే వేమన పద్యం పాడి, గ్రామాల్లో సంస్కరణల అమలు నిరంతర ప్రక్రియగా సాగాలని, కొంత కాలానికి ప్రజలకు, ప్రతినిధులకు అది అలవాటుగా మారుతుందని వివరించారు. 'నయమున బ్రాలున్ ద్రావరు, భయమునను విషమ్మునైనా భక్షింతురుగా' అనే సుమతీ శతకం పాడి, గ్రామ పంచాయతీలు విధి నిర్వహణలో అవినీతికి, నిర్లక్ష్యానికి పాల్పడితే కఠినంగా శిక్షించాలని చెప్పారు. భయముంటేనే బాగా పనిచేస్తారని, పాలన పారదర్శకంగా ఉంటుందని వివరించారు. 'జాతస్య మరణం ధ్రువం' అనే భగవద్గీత శ్లోకం చదివి పుట్టిన వారు గిట్టక మానరు కాబట్టి చనిపోయిన తర్వాత కూడా మర్యాదగా, గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించడానికి స్మశాన వాటికలు నిర్మించాల్సిన అవసరాన్ని చెప్పారు. బతికినంత కాలం కులం పేరిట, మతం పేరిట కొట్టుకు చచ్చినం, చనిపోయిన తర్వాతనైనా ఒకే దగ్గర అంత్యక్రియలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. 'ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రుస్తులై' అనే ఏనుగు లక్ష్మణకవి సుభాషితం చదివి, గ్రామాల వికాసానికి మంచి సంకల్పంతో నడుం బిగించి, తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చిన స్ఫూర్తితో పనిచేయాలని ఉద్బోధించారు.

**స్ఫూర్తి ప్రధాతల గాధలను వివరించిన ముఖ్యమంత్రి**

రిసోర్సు పర్సన్లకు అవగాహన, స్ఫూర్తి కలిగించే క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో ఎంతో కృషి చేసిన వ్యక్తులను, సంస్థలను, గ్రామాలను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల భాగస్వామ్యంతో వారు సాధించిన విజయాలను, అవి దేశానికి ఉపయోగపడిన విధానాన్ని విడమరిచి చెప్పారు. భారతదేశ మొదటి కమ్యూనిటీ డెవలప్మెంట్ మంత్రి ఎస్.కె. డే దేశంలో పంచాయతీ రాజ్ ఉద్యమానికి పురుడు పోసిన విధానాన్ని, ఆయన సలహాలు, సూచనల మేరకే మొదటి ప్రధాని నెహ్రూ నీటి పారుదల నిర్మాణానికి, వ్యవసాయ రంగాభివృద్ధికి చర్యలు తీసుకున్న వైనాన్ని వివరించారు. గ్రామాల వికాసం కోసం నాడు ఎస్.కె. డే హైదరాబాద్ లో నెలకొల్పిన ఎన్.ఐ.ఆర్.డి. గురించి చెప్పారు. ఆయన చొరవతోనే షాద్ నగర్, పటాన్ చెరువు బ్లాకులు ఏర్పడిన విషయాన్ని చెప్పారు. కొంకణ్ ప్రాంతంలో ప్రజలను చైతన్య పరిచి, ఎత్తుపల్లాలుండే భూభాగంలో వ్యవసాయం ఎలా చేయాలో చేసి చూపించిన బండార్కర్ గురించి వివరించారు. మహారాష్ట్రలోని వన్రాయ్ సొసైటీ స్వచ్ఛందంగా గ్రామాల్లో వైకుంఠ ధామాలు నిర్మించి, చేసిన సేవను వివరించారు. కూసం రాజమౌళి అనే ఒక వ్యక్తి చేసిన కృషి కారణంగా వరంగల్ జిల్లా గంగదేవిపల్లి ప్రపంచానికే ఓ ఆదర్శ గ్రామంగా ఎలా తయారైందో వివరించారు. గ్రామస్తులు, ముఖ్యంగా మహిళల సాధికారితకు నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామం ఓ ఉదాహరణగా చెప్పిన సిఎం, గ్రామాల స్వయం సమృద్ధికి, లాభదాయక వ్యవసాయానికి ఆ ఊరు ఓ రోల్ మోడల్ అని చెప్పారు. ఒక్క దోమ కూడా లేకుండా పరిసరాలను ఎలా కాపాడుకోవచ్చో హైదరాబాద్ నగర శివారు ప్రగతి రిసార్ట్స్ చేసి చూపించందని చెప్పారు. రిసోర్స్ పర్సన్లంతా తమ శిక్షణా కాలంలో గంగదేవిపల్లి, అంకాపూర్, ప్రగతి రిసార్ట్స్ సందర్శించాలని కోరారు.

**గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ కు అరుదైన గౌరవం**

రిసోర్సు పర్సన్లకు అవగాహన కల్పిస్తూ మాట్లాడిన సందర్భంగా ముఖ్యమంత్రి గంగదేవిపల్లి గ్రామం గురించి వివరించారు. ఈ సందర్భంగానే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి గురించి మాట్లాడారు. అయితే ఆశ్చర్యకరంగా పంచాయతీరాజ్ శాఖ ఎంపిక చేసిన

రిసోర్సుపర్సన్లలో రాజమౌళి కూడా ఉన్నారు. దీంతో ముఖ్యమంత్రి రాజమౌళిని సభకు పరిచయం చేశారు. ఆయన ఆదర్శ నాయకుడని కొనియాడారు. వేదిక మీదకి పిలిపించి, సీనియర్ అధికారులు, ఎమ్మెల్యేల సరసన కూర్చోబెట్టి గౌరవం ఇచ్చారు. రాజమౌళిని స్ఫూర్తిగా తీసుకుని గంగదేవిపల్లిలో గ్రామజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించానని ఈ సందర్భంగా సిఎం గుర్తు చేసుకున్నారు.

**పదవి సేవకోసం, అధికారం కోసం కాదు**

"ప్రజా ప్రతినిధులు తాము ప్రజా సేవకులమనే విషయాన్ని మరవద్దు. చట్టసభల్లో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే పదాలు పోవాలి. గ్రామాల్లో కూడా అధికారం అనే మాట రావద్దు. ప్రజా ప్రతినిధులు తాము ప్రజా సేవకులమే తప్ప, అధికారం చలాయించే వాళ్లం కాదు అనే భావన కలిగి ఉండాలి. సర్పంచ్ గా ఎన్నిక కాగానే కొందరి వేషభాషల్లో మార్పు వస్తుంది. అది తప్పు. సహజత్వాన్ని కోల్పోవద్దు. తాము పెత్తనం చేయడానికి ఉన్నామనే భావన మనసులోకి రానీయవద్దు. దురదృష్టవశాత్తూ ప్రజాస్వామ్యం(డెమోక్రసీ) నిరంకుశత్వం(అటోక్రసీ)గా మారుతున్నది. ఇది మంచిది కాదు. ప్రజలందరి భాగస్వామ్యంతో రాజకీయాలకతీతంగా పనిచేయాలి. తాము ప్రజల ప్రతినిధులమని మరవద్దు. ప్రజలందరినీ సంఘటిత పరిచి, గ్రామ సమస్యలను పరిష్కరించుకోవాలి. ప్రజల సంఘటిత శక్తిలోని బలమెంతో గుర్తెరగాలి" అని సిఎం పిలుపునిచ్చారు.

**పల్లెలు పచ్చగా కళకళలాడాలి**

"గ్రామంలో పచ్చదనం పెంచడం గ్రామ పంచాయతీల ప్రధాన బాధ్యతల్లో ఒకటి. పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలి. ఖచ్చితంగా ప్రతీ గ్రామంలో ఒక నర్సరీ ఉండాలి. ప్రతీ ఇంటికి ఆరు మొక్కలకు తక్కువ కాకుండా వారు అడిగిన మొక్కల రకాలను సరఫరా చేయాలి. గ్రామంలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలి. మొక్కల పెంపకం కోసం నరేగా నిధులు వాడుకోవాలి. గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి ఇండెంట్ సేకరించాలి. ఎవరికి ఏ మొక్కలు కావాలో అడిగి వాటిని

అందించాలి. వీధుల వెంట, ఖాళీ ప్రదేశాల్లో నీడను, ఆక్సిజన్ ను ఇచ్చే వేప, రావి లాంటి చెట్లు నాటాలి. పొలాల గట్ల మీద కావాల్సిన మొక్కలను రైతులకు అందించాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**రోడ్లపై చెత్త వేస్తే ఫైన్ వేయండి**

"గ్రామంలో పారిశుద్ధ నిర్వహణ కట్టుదిట్టంగా జరగాలి. వీధులు అద్దంలా మెరవాలి. ఎట్టి పరిస్థితుల్లో చెత్తాచెదారం రోడ్లపై కనిపించకూడదు. ప్రజలు తమ ఇండ్లను ఎలా శుభ్రంగా ఉంచుకుంటారో ఊరిని కూడా అలాగే ఉంచుకోవాలి. రోడ్లపై చెత్త వేసే వారికి రూ.500 జరిమానా విధించాలి. గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించడానికి ట్రై సైకిళ్లను ఏర్పాటు చేయాలి. డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి. పాడుపడిన, వాడని బావులను, బోర్లను వెంటనే పూడ్చివేయాలి. మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చాలి. పిచ్చిచెట్లను తొలగించాలి. ప్రతీ ఇంటిలో ఖచ్చితంగా మరుగుదొడ్డి నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. దోమలమందు క్రమం తప్పకుండా పిచికారి చేయాలి" అని ముఖ్యమంత్రి వివరించారు.

**ఆరు నెలల్లో అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు**

"సొంత స్థలం లేని వారు తమ కుటుంబ సభ్యులు చనిపోతే ఎక్కడ అంత్యక్రియలు చేయాలో తెలియదు. ఆ బాధ వర్ణణాతీతం. కాబట్టి ప్రతీ గ్రామంలో ఖచ్చితంగా వైకుంఠధామం నిర్మించాలి. దీనికోసం గ్రామ పంచాయతీ స్థలం ఇవ్వాలి. గ్రామ పంచాయతీకి స్థలం లేకుంటే ప్రభుత్వ భూమి వాడుకోవాలి. రెండూ లేకుంటే గ్రామ పంచాయతీ నిధులతో కొనాలి. దాతలు ముందుకొస్తే వారి భూమిని తీసుకోవాలి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనే వైకుంఠధామం నిర్మించాలి. అన్ని గ్రామాల్లో ఆరు నెలల్లో వైకుంఠ ధామాల నిర్మాణం జరగాలి" అని సిఎం ఆదేశించారు.

## గ్రామ పంచాయతీ విధులు వివరించిన కేసీఆర్

“ఖచ్చితంగా నూటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలి. పన్నులు వసూలు చేయని పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటాం. సర్పంచులు గ్రామంలోనే నివాసం ఉండి ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలి. గ్రామావసరాలు గుర్తించాలి. పరిష్కరించడానికి చొరవ చూపాలి. నెలకోసారి విధిగా గ్రామ పంచాయతీ సమావేశం నిర్వహించాలి. రెండు నెలలకోసారి గ్రామ సభ నిర్వహించాలి. పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి. వీధి దీపాలు వెలిగేలా, పగలు వాటిని ఆర్పేలా చర్యలు తీసుకోవాలి. వివాహ రిజిస్ట్రేషన్, జనన, మరణ రికార్డుల నిర్వహణ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనే జరగాలి. గ్రామంలో వ్యక్తిగత ఆస్తుల మ్యుటేషన్ (పేరుమార్పిడి)పై కూడా కొత్త పంచాయతీలు నిర్ణయం తీసుకోవాలి. వంగిన కరెంటు పోళ్లను సరిచేయడానికి, కిందికి జారిన వైర్లను సరిచేయడానికి పవర్ డే నిర్వహించాలి. ప్రతీ గ్రామంలో దోబీఘాట్లు నిర్మించాలి.” అని ముఖ్యమంత్రి వివరించారు.

## నిధులు వచ్చే మార్గాలను వివరించిన సిఎం

“తెలంగాణ గ్రామాల్లో 2కోట్ల 2 లక్షల జనాభా ఉంది. 14వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామాల అభివృద్ధికి మన రాష్ట్రానికి ఏడాదికి రూ.1,628 కోట్ల రూపాయలు కేంద్రం నుంచి వస్తాయి. మన రాష్ట్రం దానికి మరో రూ.1,628 కోట్లు జోడిస్తుంది. ప్రతీ ఏటా మొత్తం రూ. 3,256 కోట్లు సమకూరుతాయి. దీని ప్రకారం ఒక్కో మనిషికి రూ.1,611 చొప్పున 500 జనాభా కలిగిన గ్రామానికి కూడా ఏటా రూ.8 లక్షలు వస్తాయి. జనాభా ఎక్కువున్న గ్రామాలకు ఇంకా ఎక్కువ నిధులు వస్తాయి. ఇవి కాకుండా నరేగా నిధులు కూడా పెద్ద ఎత్తున సమకూరుతాయి. ప్రతీ ఏటా రూ.3,500 కోట్ల నరేగా నిధులు వస్తాయి. ఈ నిధులను సమర్థవంతంగా వాడుకోవాలి. లేబర్ కంపోనెంట్ కు నరేగా నిధులు వాడి, మెటీరియల్ కంపోనెంట్ కోసం గ్రామ పంచాయతీ నిధులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఆర్థిక సంఘం నిధులు వాడుకోవాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నియోజకవర్గ అభివృద్ధి నిధులను కూడా ఈ సారి గ్రామాల అభివృద్ధికే

వినియోగిస్తాం. వీటి ద్వారా రూ.480 కోట్లు వస్తాయి. ఇలా మూడు మార్గాల ద్వారా గ్రామాల అభివృద్ధికి ఏడాదికి రూ.7,236 కోట్లు సమకూరుతాయి. ఈ నిధులే కాకుండా రాష్ట్ర బడ్జెట్ లోనూ నిధులు కేటాయిస్తాం. సి.ఎస్.ఆర్. ద్వారా, దాతల విరాళాల ద్వారా కూడా నిధులు సమకూర్చుకోవాలి. శ్రమదానం ద్వారా కూడా కొన్ని పనులు డబ్బులతో అవసరం లేకుండా చేసుకోవాలి. మొత్తంగా ఐదేళ్లలో 40వేల కోట్లు గ్రామాలకు సమకూరుతాయి. ఈ నిధులతో గ్రామాలాభివృద్ధికి అద్భుతాలు చేయవచ్చు'' అని సిఎం వివరించారు.

**25 ఆకస్మిక తనిఖీ బృందాలు**

''గ్రామ పంచాయతీలకు కావాల్సిన నిధులిస్తాం. విధులిస్తాం. బాధ్యతలు అప్పగిస్తాం. అన్నీ ఇచ్చినా కూడా పనిచేయని గ్రామ పంచాయతీల విషయంలో మాత్రం సీరియస్ గానే ఉంటాం. ప్రభుత్వం సమకూర్చిన నిధులు ఎలా ఖర్చు పెడుతున్నారో తెలుసుకోవడానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడానికి 25 బృందాలు ఏర్పాటు చేస్తాం. ఒక బృందంలో నేనే ఉంటాను. దూర ప్రాంతాలు పర్యటించడానికి హెలికాప్టర్ లు కూడా సమకూరుస్తాం. నిరంతరం తనిఖీలు జరుగుతూనే ఉంటాయి. ఎవరు ఎప్పుడు ఎక్కడికి పోతున్నారో తెలియకుండా ఆకస్మికంగా తనిఖీలుంటాయి. ప్రతీ రోజు ఏదో ఓ చోట ఈ తనిఖీలు జరుగుతూనే ఉంటాయి. ఏ నిధులు ఎక్కడ ఎలా ఖర్చు చేస్తున్నదీ ఆరా తీస్తాం. ఇంటెలిజెన్స్ ద్వారా కూడా సమాచారం తెప్పించుకుంటాం. పచ్చదనం పెంచడానికి, పరిశుభ్రత కాపాడడానికి తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తాం. ఎక్కడ తేడా వచ్చినా సర్పంచ్, గ్రామ కార్యదర్శులను సస్పెండ్ చేస్తాం. దీనికోసం చట్టంలో కూడా నిబంధనలు పొందుపరిచాం'' అని సిఎం చెప్పారు.

**కరెంటు బిల్లు బకాయి పెడితే సస్పెండే**

''వీధి దీపాలు, ఇతరత్రా అవసరాల కోసం వాడే కరెంటుకు స్థానిక సంస్థలు బిల్లులు సరిగా చెల్లించడం లేదు. గ్రామ పంచాయతీలు విద్యుత్ సంస్థలకు రూ.2,570 కోట్ల బకాయిలు చెల్లించాలి. మున్సిపాలిటీలు రూ.455 కోట్లివ్వాలి. మొత్తం రూ.3,025 కోట్ల బకాయిలున్నాయి. ఇట్లయితే

విద్యుత్ సంస్థలు ఎలా నడవాలి. కరెంటు ఎలా ఇవ్వాలి. ఇకపై ఎప్పటికప్పుడు కరెంటు బిల్లులు చెల్లించాలి. జాప్యం చేసిన వారిని సస్పెండ్ చేస్తాం" అని సిఎం హెచ్చరించారు.

**పెదిరిపాడు సంఘటనపై సిఎం ఖండన**

మహబూబ్ నగర్ జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడు గ్రామంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ బాలప్పను నేలపై కూర్చోబెట్టిన సంఘటనను సిఎం కేసీఆర్ తీవ్రంగా ఖండించారు. ఇలా చేయడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఎక్కడ ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**మొక్కై వంగనిది మానై వంగునా అన్న సిఎస్**

రిసోర్సు పర్సన్లనుద్దేశించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి ప్రారంభోపన్యాసం చేశారు. మొక్కై వంగనిది మానై వంగునా అనే సామెత చెప్పి, కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కొత్తగా నియామకమయ్యే గ్రామ కార్యదర్శులకు సరైన అవగాహన కల్పించి, గ్రామ వికాసానికి వారిని చేంజ్ ఏజెంట్లుగా మార్చాలని చెప్పారు.

**నిష్ణాతులతో రిసోర్సు పర్సన్ల బృందం**

స్థానిక సంస్థలను పనిచేసే పరిపాలనా విభాగాలుగా తీర్చిదిద్దడం ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక సంస్థల ప్రతినిధులకు తగిన శిక్షణ ఇవ్వడం, ఎప్పటికప్పుడు వారి పనితీరును మదింపు చేయడం కోసం నిష్ణాతులైన రిసోర్సు పర్సన్లను ప్రభుత్వం ఎంపిక చేసింది. గ్రామ వికాస ప్రణాళికలపై అవగాహన కలిగి, పంచాయతీ రాజ్ సంస్థల్లో పనిచేసిన అనుభవం కలిగిన 320 మందితో రాష్ట్ర స్థాయి బృందాన్ని తయారు చేసింది. పంచాయతీ రాజ్ అధికారులతో పాటు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మాజీ సర్పంచులు, రిటైర్డ్ ఉద్యోగులు కూడ ఇందులో ఉన్నారు. ప్రస్తుతం వీరికి తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో శిక్షణ ఇస్తారు. ఈ రిసోర్స్ పర్సన్లే జిల్లాల వారీగా

సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణా తరగుతులు ప్రతీ ఆరు నెలలకోసారి నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

.....................................................................................................................................

**సిపిఆర్ఓ టు సిఎం**